



ప్రశాంతంగా యుపిఎస్‌సి సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

ఉదయం 49.44శాతం, మధ్యాహ్నం 49.31శాతం హాజరు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆదివారం జరిగిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ- 2024 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆదివారము ఉదయం 9:30 నుండి 11:30వరకూ, మధ్యాహ్నం 2:30 నుండి 4:30 గంటల వరకు రెండు సెషన్ల లో పరీక్ష నిర్వహణ జరిగిందనీ, తిరుపతిలో నిర్వహించిన 11 పరీక్షా కేంద్రాల లో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలకు 5518 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఉదయం 2728 మంది 49.44 శాతంగా, మధ్యాహ్నం 2721 మంది 49.31 శాతంగా హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుండి బందోబస్తు నడుమ సంబంధిత పరీక్ష కేంద్రాలకు తరలించామన్నారు.


బాధ్యతల స్వీకరణ అనంతరం ఈవో తనిఖీలు

చంద్రబాబు విజన్‌తో తిరుమల అభివృద్ధి

టిటిడి ఈవో శ్యామలరావు బాధ్యతలు స్వీకరణ

పారిశుధ్య నిర్వహణ బాగోలేదని ఆగ్రహం

ప్రజాశక్తి - తిరుమల

హిందువులందరికీ తిరుమల పవిత్రమైన దేవాలయమని, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఈవోగా రావడం తన అదృష్టమని, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో తిరుమలను అభివృద్ధి చేస్తానని నూతన ఈవో జె.శ్యామలరావు అన్నారు. టిటిడి కార్యనిర్వహణాధికారిగా ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి నుంచి బాధ్యతలను స్వీకరించారు. సతీమణితో కలిసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆ తర్వాత జెఇఒ వీరబ్రహ్మం ఈవోకు శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా శ్రీ వరాహ స్వామివారిని ఈవో దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. జెఇఒ గౌతమి, సివిఎస్ఒ నరసింహకిషోర్, ఎస్వీబీసీ సిఇఒ షణ్ముఖ్ కుమార్, డిప్యూటీ ఈవో లోకనాధం పాల్గొన్నారు.

దర్శన క్యూలైన్లు పరిశీలన

దర్శన క్యూలైన్లను నూతన ఈవో శ్యామలరావు పరిశీలించారు. క్యూలైన్ల వద్ద పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతలు చేపట్టినరోజే క్షేత్రస్థాయి పరిశీలన చేయడం గమనార్హం. భక్తులకు అందించే తాగునీటిని పరిశీలించి ల్యాబ్‌కు పంపించాలని ఆదేశించారు. ఇద్దరు పారిశుధ్య అధికారులకు మెమోలు జారీ చేశారు. టిటిడి ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



వారం రోజుల పాటు నిర్విరామంగా...

సప్తగిరి సంగీత సప్తాహం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సప్తగిరి సంగీత సప్తాహం పేరుతో 24 గంటలు నిరంతరాయంగా వారం రోజులపాటు తలపెట్టిన కార్యక్రమం ఆదివారం సంగీత కచేరిలతో ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఉదయం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై.. తిరుపతి కి చెందిన సంగీత విద్వాంసులు .. ప్రపంచ ప్రఖ్యాత వయోలిన్ గాత్ర విద్వాంసులు సంగీత గ్రంథకర్త ఎస్వి సంగీత కళాశాల విశాంత ప్రిన్సిపాల్ కొమాండూరు శేషాద్రి సంగీత కచేరి, అనంతరం ప్రపంచ ప్రఖ్యాత డోలు విధ్వాంసులు ఎస్వి నాదస్వర పాఠశాల అధ్యాపకులు వైయల్ శ్రీనివాసులు , వైఎల్ హరిబాబు బందం చే మంగళ ధ్వని నిర్వహించారు. డాక్టర్ కొల్లూరు వందన గాత్రం చేయగా, ఆముదాలవలసకు చెందిన డాక్టర్ మావుదురి సత్యనారాయణ శర్మ చే వయోలిన్, కోటిపల్లి రమేష్ మదంగం హనుమంతరావు చే ఘట్టం .. అదేవిధంగా చిన్నమ్మ దేవి చే గాత్రం.. ధీరజ్ చే వయోలిన్.. ధర్మారావుచే మదంగం , రామకష్ణచే ఘట్టం.. ఇలా అనేక బందాలచే గాత్ర కచేరీలు ఘనంగా అందరినీ ఆకట్టుకున్నాయి. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్విరామంగా సాగనుంది.

తోతాపురి టన్ను రూ.30వేలకు కొనాలి


'గుజ్జు' పరిశ్రమ యజమానులకు కలెక్టర్ హెచ్చరిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల, మామిడి ర్యాంపు యజమానులు, మండీ యజమానులు తోతాపురి మామిడికాయలకు టన్నుకు 30 వేల రూపాయలకు తగ్గకుండా ధర రైతులకు చెల్లించాలని, అలా కాకుండా తక్కువ ధర చెల్లించనచో కఠిన చర్యలు ఉంటాయనీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. తిరుపతి జిల్లాలో మామిడి పంట 52వేల ఎకరాలలో సాగు చేస్తున్నారని, ఈ సంవత్సరం మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిందని, సాధారణంగా ఎకరాకు నాలుగు నుండి ఆరు టన్నులు దిగుబడి వచ్చేదని, అయితే ఈ సంవత్సరం ఎకరాకు రెండు టన్నులు కూడా రాని పరిస్థితి నెలకొన్నదని, దిగుబడులు తగ్గడం వలన ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారని, అయితే గత నాలుగు అయిదు రోజులుగా మామిడి ధరలు పతనం కావడంపై జిల్లా కలెక్టర్ ఉద్యానవన, మార్కెటింగ్, ఇతర సంబంధిత శాఖల అధికారులతో మామిడి ధరలపై సమీక్షించారు. ఎవరైనను మామిడికాయలకు (తోతాపురి) టన్నుకు 30 వేల రూపాయలకు తగ్గకుండా చెల్లించాలని ఆదేశించారు. అలాకాకుండా ఎవరైనా టన్నుకు 30 వేల రూపాయలకన్నా రైతులకు తక్కువ చెల్లించినచో అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ మామిడికి ధర కల్పించడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని ఎన్నికల హామీల్లో భాగంగా మామిడికి గిట్టుబాటు ధర కల్పించారన్నారు.



నాణ్యమైన విద్యకు దిక్సూచి 'స్లేట్'



ప్రజాశక్తి-తిరుపతి సిటి

మీ పిల్లల విజ్ఞానానికి... వికాసానికి... ఉజ్వల భవిష్యతకు బాటలు వేయడానికి, నాణ్యమైన విద్యకు దిక్సూచి 'స్లేట్' స్కూల్ అని ఆ స్కూల్ ఛైర్మన్ వాసిరెడ్డి అమరనాథ్ తెలిపారు. స్థానిక తనపల్లివద్ద ఉన్న వెంకటాపురంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలవంతమైన ప్రాంతంలో స్లేట్ స్కూల్‌ను స్థాపించామన్నారు. ఆ స్కూల్ ప్రాంతంలో 'ప్రజాశక్తి'తో ఆయన తన అనుభవాలను పంచుకున్నారు.

వాసిరెడ్డి అమరనాథ్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఉపాధ్యాయ దంపతులకు జన్మించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పిజి గోల్డ్‌మెడల్ సాధించి సర్వీస్ కోసం హైదరాబాదులో కోచింగ్ తీసుకున్నారు. ఈ క్రమంలో అక్కడ యూనివర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు. సివిల్స్‌లో మూడు సార్లు ప్రిలిమ్స్, మెయిన్స్ దాటి ఇంటర్వ్యూ దశకు వెళ్లారు. అయితే ఆశించిన ఐఎఎస్ రాకపోవడంతో స్వయంగా ఐఎఎస్ శిక్షణ ప్రారంభించారు. సుమారు దశాబ్దకాలం తన కోచింగ్ ద్వారా వందలాది మందిని ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా, టీచర్లుగా తీర్చిదిద్దారు. వ్యక్తత్వ వికాసానికి బాల్యంలోనే బలమైన పునాది పడాలనే ఆలోచనతో 2001లో హైదరాబాదులోని బషీర్‌బాగ్‌లో 'స్లేట్ ది స్కూల్'ను స్థాపించారు. 70 మందితో ప్రారంభమైన పాఠశాల నేడు వేలాది మంది విద్యార్థులతో విరాజిల్లుతోంది. నాణ్యమైన, సంపూర్ణాత్మక విద్యను అందిస్తున్న అగ్రగామి సంస్థ స్లేట్. స్లేట్ స్కూల్ సీట్ కోసం హైదరాబాదు వంటి నగరాల్లో ఏళ్ల తరబడి తల్లిదండ్రులు వేచి ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఆతర్వాత అంచెలంచెలుగా ఎదుగుతూ విద్యాసంస్థలను రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విస్తరింపజేశారు. రెండు తెలుగురాష్ట్రాల్లోని విద్యారంగంలో ఎన్నో విజయాలను స్లేట్ సొంతం చేసుకుంది. హైదరాబాదులో ఐదు బ్రాంచిలు, విజయవాడలో ఒక బ్రాంచ్, తిరుపతిలో మరో బ్రాంచ్‌ను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రుల ఆశయాలకు అద్దంపట్టేలా విద్యాబోధనకు స్లేట్ శ్రీకారం చుట్టింది. నాణ్యమైన విద్యను పిల్లలకు అందించి అందర్నీ ఉన్నత శిఖరాలకు చేరుకునేలా జ్ఞానాన్ని అందించడంలో స్లేట్‌కు స్లేటే సాటి.

మాతృభూమిపై మమకారంతో...



మాతృభూమిపై మమకారంతో తిరుపతిలోనూ స్లేట్ స్కూల్‌ను ప్రారంభించాం. తిరుపతి రైల్వేస్టేషన్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో, కాలుష్యరహితమైన పచ్చని పరిసరాల్లో, విశాలమైన ప్రాంగణంలో స్కూల్ స్థాపించాం. కార్పొరేట్ మాయాజాలంలో పడి కొట్టుమిట్టాడుతున్న పాఠశాల విద్యకు అమ్మఒడిలోని కమ్మదనాన్ని, నాన్న ఒడిలోని గొప్పదనాన్ని, గురుశిష్య పరంపరంలోని ప్రభావాన్ని..సమ్మిళితం చేసి బోధన అందిస్తున్నాం. ప్రపంచీకరణ వైపు పరుగులు తీస్తున్న సమాజానికి అనువుగా, రాజీలేని నాణ్యత, వినూత్న బోదనా విధానం అవలంబిస్తున్నాం. తిరుపతి సమీపంలో పిల్లల బంగారు భవిష్యత్తు కోసం సకల సౌకర్యాలతో స్లేట్ స్కూల్ సిద్దంగా ఉంది.ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. మీ పిల్లల బంగారు భవితకు స్లేట్ స్కూల్‌ను ఎంపిక చేసుకోవాలని, వివరాలకు 7702733349 నెంబరును సంప్రదించాలి.

-వాసిరెడ్డి అమరనాథ్, స్లేట్ స్కూల్ చైర్మన్.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ కాల్పులు విరమించాలి

ప్రజాశక్తి -రేణిగుంట



పాలస్తీనా పౌరులపై ఇజ్రాయిల్ సైన్యం జరుపుతున్న కాల్పులను విరమించాలని సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ అన్నారు. రేణిగుంట ఫ్లై ఓవర్‌కింద 'రాజ్యాంగ పరిరక్షణ వేదిక' ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సదస్సు ఆదివారం జరిగింది. రాఘవశర్మ మాట్లాడుతూ పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధంపై మానవాళి కలత చెందుతోందన్నారు. అమానవీయ మారణహోమాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. 20 లక్షల మంది పాలస్తీనా ప్రజలు సొంత గడ్డపై శరణార్థులుగా మారిపోవడం చూస్తుంటే ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టే పరిస్థితన్నారు. ఇజ్రాయిల్‌కు వెంటనే ఆయుధ సరఫరా ఆపి, సైనిక సంబంధాలను రద్దు చేసుకోవాలన్నారు. ఆవాజ్ నాయకులు దిలీప్‌బాషా ఈ సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ఇజ్రాయిల్ దాడిలో మరణించిన పాలస్తీనావాసులకు సంతాపం తెలిపారు. పాలస్తీనాను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాలన్న తీర్మానాన్ని ఏకగ్రీవంగా సభ ఆమోదించింది. ఈ సదస్సులో జనవిజ్ఞాన వేదిక నాయకులు షరీఫ్, రఫీ, సత్యశ్రీ,, అమీర్ భాషా, హరినాథ్, రమణ తదితరులు ప్రసంగించారు.

జర్నలిస్టు సమాజానికి రుణపడి ఉంటా: ఎంఎల్ఎ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జర్నలిస్టుగా సమాజంలో ప్రజా సమస్యలను అధ్యయనం చేసిన తనకు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించిన సీఎం నారా చంద్రబాబునాయుడుకు, పూతలపట్టు నియోజకవర్గ ప్రజలకు, జర్నలిస్టులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని సీనియర్ జర్నలిస్ట్, పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మురళీమోహన్ కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ 22 ఏళ్లుగా జర్నలిస్టుగానే ఉంటూ తనకున్న చిరకాల వాంఛ శాసనసభ్యుడి కలను నేటికి నెరవేర్చుకోగలిగానన్నారు. తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు తనకు సుపరిచితులని, ఎన్నో ఏళ్లుగా తిరుపతి ప్రెస్ క్లబ్ కు సొంత భవన నిర్మాణానికి స్థల కేటాయింపుకు, జర్నలిస్టులకు హౌస్ సైట్లను ప్రభుత్వం కేటాయింపజేసేలా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్ర, కోశాధికారి శ్రీకాంత్, ప్రజాశక్తి సిబ్బంది శ్రీనివాసులు, సురేష్, విలేఖరి గౌస్ బాషా ప్రత్యేకంగా అభినందించారు.



ప్రతిపక్షాలపై దాడులు మంచిది కాదు : సిపిఐ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీలు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేల పైన అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు దాడులు చేయడం మంచిది కాదని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి సంయుక్తంగా ఏర్పాటైన ఎన్డీఏ కూటమి ద్వారా 164 సీట్లు గెలుచుకొని అధికారం చేపట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. అయితే వైఎస్ఆర్ పార్టీ ఎమ్మెల్యేలను, గెలవని ఎమ్మెల్యేల పైన అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు దాడులు చేయడం, దాడులు చేస్తామని బెదిరింపు చర్యలకు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. తాజాగా పుంగనూరు ఎంఎల్ఏ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బెదిరింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. ప్రతిపక్ష పార్టీలను గౌరవించాలన్నారు.వైఎస్ఆర్ పార్టీ అలా చేయడం వల్లనే 11 సీట్లకే పరిమితమయ్యిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

'పెర్టీ9 పెర్టిలిటీ సెంటర్'ను విస్తరింపజేస్తాం: డాక్టరు సునీత సాధు

ప్రజాశక్తి-తిరుపతి సిటి



దేశంలో మూడో అతిపెద్ద, దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ ఐవిఎఫ్ చైన్‌లలో ఒకటైన పెర్టీ9 పెర్టీలిటీ సెంటర్, తిరుపతి కేంద్రంలో తమ కార్యకలాపాలు మరింత విస్తరింపజేస్తామని తిరుపతి కేంద్రం కన్సల్టెంట్ డాక్టరు సునీత సాధు తెలిపారు. తిరుపతిలో పెర్టి9 పెర్టిలిటీ సెంటర్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులుగా మారాలనే కలను నెరవేర్చుకోవడానికి తమ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. భవిష్యత్ పెర్టిలిటీ ట్రీట్‌మెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. రోగి కేంద్రీకృత సంరక్షణకు ప్రాధానత్య ఇస్తున్నామన్నారు. మరో కన్సల్టెంట్ డాక్టరు దీప్తి దామోదర మాట్లాడుతూ తిరుపతిలో పెర్టీ9పెర్టిలిటీ సెంటర్‌లో సాంకేతికత, రోగి అనుభవం రెండింటిపరంగా శ్రేష్టతకు ప్రాదాన్యత ఇస్తున్నామన్నారు.

ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలోని ముస్లిం సోదర సోదరీ మణులందరూ మత సామరస్యంగా బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి, డిఆర్ఒ పెంచలకిషోర్ శుభాకాంక్షలు తెలిపారు.

సేంద్రీయ సంత... ఆరోగ్యం అంతా..!

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

కరోనా తరువాత కొంతమంది ఆరోగ్యం పట్ల పూర్తిస్థాయిలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. మరికొంతమంది సంపాదన మోజులో ఫాస్ట్‌ఫుడ్ కల్చర్‌కు చేరువయ్యారు. అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఎలాగైనా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకునే వారి కోసం 'కనెక్ట్ ది ఫార్మర్స్' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినెలా ఆర్గానిక్ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తోంది. నాబార్డు సహకారంతో మహతి కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆర్గానిక్ మేళా శనివారంతో ముగిసింది. ఆహార ఉత్పత్తులు, దినుసులు, వనమూలికలు ఉత్పత్తులు, కాయగూరలు, ఆకుకూరలు ఇలా దాదాపుగా 100కి పైగా మేళాలో వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. 50ఏళ్ల క్రితం 'మచ్చకంది' అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఐదారుమంది రైతులు మాత్రమే దీన్ని పండిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.

600 రకాల ఒడ్లున్నాయి : అనకలి హరిక్రిష్ణ(రైతు), పెసవాయి గ్రామం, గడివేముల(మం), నంద్యాల జిల్లా



మన పూర్వీకులు సేంద్రీయ వ్యవసాయ పంటలను పండించి వాటినే తిని ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. కాలానుగుణంగా భూమి సారవంతం కోల్పోయి సత్తవ లేని ఆహార పదార్థాలు పండుతున్నాయి. వాటిని తిని మన ఆరోగ్యాన్ని క్షిణింపజేసుకుంటున్నాం. గతంలో 600 రకాల ఒడ్లున్నాయి. వాటిలో అందుబాటులో ఉన్నవి కొన్ని మాత్రమే. ఎక్కువ భాగం పాలిష్ పట్టడం వలన విటమిన్లను మనం కోల్పోతాము. ఈ ప్రదర్శన ద్వారా మంచివి, మరుగున పడిపోతున్న సేంద్రీయ ఉత్పత్తులను ప్రజలకు వివరించి అమ్మకాలు సాగిస్తున్నాం. దేశవాలీ విత్తనంతో సుగంధ పసుపు నాణ్యమైనది.

మనిషి సహజ సౌందర్యానికి : ఎం.శేషసాయి, లక్ష్మి గోమయ ప్రొడక్ట్స్, గుంటూరు జిల్లా

నిత్య జీవితంలో మనిషి తన సౌందర్యాన్ని సహజంగా కాపాడుకోవడానికి అవసరమైన వినియోగాలను వనమూలికల ద్వారా ఉత్పత్తి చేసి ఆయా ఉత్పత్తులను మేళాల ద్వారా ప్రజలకు వివరించి అమ్మకాలను సాగిస్తున్నాం. భావన అల్లం, భావన జీలకర్ర, భావన ఉసిరి, గో ఆధారిత పళ్లపొడి, దశదినుసులు ఇలా చాలా వనమూలికల ఉత్పత్తులను అందుబాటులో ఉంచాము. గ్యాస్టిక్ ట్రబుల్, ఎర్రచందనం సోపులు, జుట్టు పెరగడానికి తైలం ఈ మేళాలో సందర్శకులకు వివరించి అమ్మకాలు చేస్తున్నాం.



50 ఏళ్ళకే అనారోగ్యపాలవుతున్నారు : మురుగానందమ్, రైతు, సేలం జిల్లా, తమిళనాడు

నేడు ఆహార పంటలు రసాయన పద్ధతుల్లో పండించడం మూలాన 50 ఏళ్ళకే అన్నారోగ్యపాలవుతున్నారు. దేశవాలీలో 70 రకాల విత్తనాలకు తిరిగి ఆర్గానిక్ మేళాల ద్వారా ప్రాచూర్యం కల్పిస్తున్నాం. నేను సివిల్ ఇంజినీరింగ్ చదివాను. కాని మనిషి చిన్నతనంలో వస్తున్న ఆరోగ్య సమస్యలకు మూలం జీవం లేని ఆహార పదార్థాలను తింటున్నారని గ్రహించి ప్రజలకు నాణ్యమైన మన పూర్వ పద్దతులను అనుసరించి పండించే సేంద్రీయ ఉత్పత్తులను అందించాలనే సంకల్పంతో ఇటువంటి ఆర్గానిక్ మేళాలకు వచ్చి దేశవాలీ విత్తనాలను తక్కువ ధరలకే అమ్ముతున్నాను. ఎలిఫెంట్ ట్రంక్ ఒక్రల్ బెండ దాదాపుగా ఒకటిన్నర అడుగు పెరుగుతుంది. అలానే వింగుడ్ బీన్స్ 5 నెలలకు కాపు వస్తుంది. వీటివల్ల చక్కటి ఆరోగ్యం పొందవచ్చు అని నేటి తరానికి తెలపాలన్నదే నా లక్ష్యం.






'కనెక్ట్ ది ఫార్మర్స్'చే ప్రతిమాసం 'ఆర్గానిక్' మేళా

సేంద్రీయ ఉత్పత్తులను వినియోగించాలి

సునీల్, డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, నాబార్డ్, చిత్తూరు జిల్లా



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి నాణ్యమైన ఆహారాన్ని తిని ఆరోగ్యవంతంగా ఉండాలనే లక్ష్యంతో కనెక్ట్ ది ఫార్మర్ వారు చక్కటి మేళాలను నిర్వహిస్తున్నారు. ప్రకృతిలో సహజ వనరులను వినియోగించి వచ్చే ఆహార పంటలను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలనే ప్రయత్నం అభినందనీయం. మేము సేంద్రీయ ఉత్పత్తులు పెరిగేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూనే మేళాలను నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తాం.

కోళ్ల ఫారాల సమీపంలో అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీలో సర్వే నెంబర్ 195 లోని కోళ్ల ఫారాల సమీపంలో ఆదివారం అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనిపై సంబంధిత వీఆర్వో భూపతి ఆచారిని వివరణ కోరగా అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి కూల్చి వేస్తామని తెలిపారు. అయితే శనివారమే అక్రమ నిర్మాణాన్ని ఆపాలని వీఆర్వో భూపతి సూచించినా పనులు కొనసాగిస్తుండడం గమనార్హం.

నెలవల విజయశ్రీకి సన్మానాల వెల్లువ


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి పలువురు టిడిపి నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం నివాసంలో ఆదివారం పలువురు టిడిపి నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు పచ్చ మాధవ నాయుడు, సూళ్లూరుపేట పట్టణ ప్రధాన కార్యదర్శి అడికుప్పం బాలచందర్, నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిలర్ వెంకటస్వామి, వెంకటయ్య, గౌడ సంఘం నాయకులు నాగరాజు, సీనియర్ టిడిపి నాయకులు సురేష్ నాయుడు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దంపతులకు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కాసాగార్డెన్ కు పూర్వవైభవం: ఎమ్మెల్యే


కాసాగార్డెన్ రెసిడెన్షియల్ స్కూలును తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మరో ఆరు నెలల్లో కాసాగార్డెన్ గురుకులానికి పూర్వ వైభవం తీసుకొస్తా మని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన కాసాగార్డెన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. రెసిడెన్షియల్‌లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నాడు-నేడు కింద జరిగిన పనుల్లో అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. సీఎస్ఆర్ ఫండ్ ను వినియోగించి కాసాగార్డెన్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభావతి పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం


గర్భిణులకు కిట్లు అందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ వైజెపి చైర్మన్ మురళినాయుడు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టకర మని పిల్లలను మంచి పౌరులుగా పెంచాలని గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ప్రతి నెలా లయన్స్ క్లబ్ ఆఫ్ వైజెపి ఆధ్వర్యంలో గర్భిణులకు కిట్లు అందిస్తున్నామని ప్రాజెక్టు ఛైర్మన్ మురళి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం దాత కొడాలి జగదీష్ కుమార్తె అశ్వని పుట్టిన రోజు సందర్భం గా కేక్ కట్ చేసి అందరికీ అందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఛైర్మన్ మురళి నాయుడు మాట్లాడు తూ లయన్స్ క్లబ్ ఆఫ్ వైజేపీ ఆధ్వర్యంలో ప్రతినెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో క్లబ్ అధ్య క్షులు ఎస్ఎల్ఎన్ స్వామి , గోపీనాథ్‌రెడ్డి, గోపీనాథ్ రెడ్డి , రాధాకృష్ణా రెడ్డి , జగదీష్ పాల్గొన్నారు .

ఘనంగా టిడిపి మండల అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -బుచ్చినాడు కండ్రిగ: మండలంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆ పార్టీ మండల అధ్యక్షులు జన్మదిన వేడుకలను టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రసిడెంట్ సుధాకర్ నాయుడు మాట్లాడుతూ టిడిపి ఉమ్మడి కూటమి విజయం సాధించడం గొప్ప సంతోషకరమని అందులో బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో టిడిపికి మంచి మెజారిటీ రావడం బుచ్చినాయుడు కండ్రిగ ఎన్డీఏ కూటమి నాయకులు ఎంతో శ్రమించి పార్టీకి అండగా ఉంటూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనసభ్యులుగా నియమించిన అభ్యర్థిని మంచి మెజార్టీతో గెలిపించడం చాలా సంతోషంగా వుందన్నారు. మండలంలో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తనకు తెలిపితే వెంటనే అధిష్టానానికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జన్మదిన కేకును కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీవ్ నగర్ లో రూ.100 కోట్ల అవినీతి: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గడచిన ఐదు సంవత్సరాల కాలంలో శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని రాజీవ్ నగర్, దాని పరిసర ప్రాంతాలలో జరిగిన భూ దోపిడీ విలువ వంద కోట్ల రూపాయలని టీడీపీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం ఉమేష్ రావు ఆదివారం ఆరోపించారు. ఎన్నో వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అధికార బలంతో ఆక్రమించి, తమ ఇష్టానుసారం అమ్ముకొని సొమ్ము చేసుకున్న భూ దోపిడీదారులపై పిడి యాక్ట్ పెట్టాలని ఉమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని అనేక ప్రాంతాలలో గతంలో జరిగిన భూ కబ్జా లకు పరోక్షంగా మద్దతు పలికిన ప్రతీ ఒక్క అధికారిపై కేసులు నమోదు చేసేలా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు సర్వే నెంబర్లతో పట్టాలు సృష్టించడం, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడం ఒక ఎత్తయితే కాలువ పోరంబోకు, గుట్ట పోరంబోకు, డి పట్టా తదితర భూముల రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన వ్యక్తుల పేర తాత్కాలికంగా 1-బీ ని ఆన్లైన్ లో పొందుపరచడం, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సదరు 1-బీ ని తొలగించేసి, భూ దోపిడీకి పరోక్ష సహకారం అందించిన అధికార యంత్రాంగం పైన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఉమేష్ డిమాండ్ చేశారు. రాజీవ్ నగర్, కైలాసగిరి కాలనీ తదితర ప్రాంతాలలో గడచిన ఐదు సంవత్సరాల కాలంలో బాధ్యతలు నిర్వర్తించిన ప్రతీ రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ అధికారులపై విచారణ జరిపి భూ దోపిడీకి సహకరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉమేష్ విజ్ఞప్తి చేశారు.

వైసిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ:

శ్రీకాళహస్తి హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బుచ్చినాయుడు కండ్రిగ మండలం భవాని శంకరాపురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త తిలక్ ను తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. తిలక్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పు చేసే ధైర్యం నాకు లేదు.. ఆ మనస్తత్వం కాదు : చెవిరెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

'దేవుని దగ్గర తప్పు చేసే ధైర్యం నాకు లేదు.. ఆ మనస్తత్వం నాది కాదు..' అని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శన సిఫార్సు లేఖలపై తనపై వచ్చిన ఆరోపణలకు ఆయన వివరణ ఇచ్చారు. టీటీడీ నిబంధనలు మేరకు సోమవారం నుంచి గురువారం వరకు నాలుగు రోజులు పాటు స్థానిక శాసన సభ్యునిగా 10 మందికి, రాష్ట్ర ప్రభుత్వ విప్ గా మంత్రి వర్గ హోదా కలిగి ఉన్నందున మరో 10 మందికి మొత్తం 20 మందికి, తుడా ఛైర్మన్, టీటీడీ పాలక మండలి సభ్యులుగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి 20 మందికి సిఫార్సు లేఖలతో దర్శనం కల్పించేందుకు అనుమతి ఇచ్చారు. టీటీడీ అధికారుల సూచనల మేరకు మా ఇద్దరికీ ఇచ్చిన కోటాను (40 మందికి) ఒకే సిఫార్సు లేఖలో రాసి పెట్టాము.. అంతే తప్ప ఎక్కడా తప్పు చేయలేదు. మేము దర్శనానికి సిఫార్సు చేసిన వారి పేర్లు, ఫోన్ నెంబర్లను కూడా ఇస్తాం.. ఎవ్వరైనా వారితో మాట్లాడవచ్చు. నా సొంత డబ్బులు కట్టి అనేక మందికి దర్శనం టిక్కెట్లు కొని ఇచ్చి వుంటానే తప్ప ఏ ఒక్కరైనా డబ్బు ఇచ్చి సిఫార్సు లేఖ తీసుకున్నట్లు చెబితే ఏ శిక్షకైనా సిద్ధ మని పేర్కొన్నారు. తప్పు చేసే ధైర్యం తనకు లేదని ఆ మనస్తత్వం కూడా తనది కాదన్నారు. ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

కరకంబాడి మార్గంలో అగ్నిప్రమాదం


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన చలువ పందిరి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మంగళం పరిధిలోని తిరుపతి కరకంబాడి మార్గం చెన్నాయిగుంట వద్దఉన్న తెలుగు గంగా పంప్ హౌస్ ఎదురుగా ఉన్న ఓ టీ స్టాల్ వద్ద ఏర్పాటుచేసిన చలువ పందిరికి మంటలు ఏర్పడి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. టీ స్టాల్ నిర్వాహకులు గిరీష్ వివరాల మేరకు రాత్రి 9 గంటల సమయానికి టీ స్టాల్ మూసివేసామని, అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో చలువ పందిరికి మంటలు అంటుకున్నాయని సమాచారం రావడంతో టీ స్టాల్ వద్దకు చేరుకుని పరిశీలించగా అప్పటికే పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడుతున్నాయన్నారు. అగ్నిమాపక దళం సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలు ఆర్పారన్నారు. టీ స్టాల్ కు వచ్చే కస్టమర్ల కోసం చలువ పందిరిని రెండు రోజుల క్రితమే ఏర్పాటు చేశామని గిరీష్ తెలిపారు. అయితే ఎవరైనా దురుద్దేశంతో చలువ పందిరికి నిప్పు పెట్టారా?, లేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో జరిగిందా అన్న విషయాలు తెలియాల్సి ఉంది. ఈ అగ్ని ప్రమాద ఘటనలో దాదాపు లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని, అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు ఉన్నాయని టీ స్టాల్ నిర్వాహకుడు గిరీష్ తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజలకు జవాబుదారీగా ఉంటా : ఎంఎల్ఎ ఆరణి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

భారీ మెజార్టీతో తనను గెలిపించిన నియోజకవర్గం ప్రజలకు జవాబుదారీగా ఉంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. తన గెలుపు ప్రజా గెలుపని ఉద్ఘాటించారు. గేట్ విద్యాసంస్థల అధినేత, జనసేన తిరుపతి పరిశీలకులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఆదివారం మధ్యాహ్నం గేట్ విద్యాసంస్థల ఆడిటోరియంలో జరిగిన సన్మాన సభకు అపుస్మా, అప్సా ప్రతినిధివర్గం పాల్గొంది. తిరపతి ప్రజలు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఉద్యోగులు ముఖ్యంగా ఉపాధ్యాయులు తన గెలుపులో కీలక పాత్రపోషించారని చెప్పారు. టీచర్ల పట్ల గత ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందన్నారు. ఈ కార్యక్రమంలో అపుస్మా అధ్యక్షులు వెంకటరమణా రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎస్ ఎం భాషా, భాస్కర్ రాజు, అప్సా అధ్యక్షులు శ్రీనివాసరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ , కమ్మ సంఘం నాయకులు పురంధర్ నాయుడు పాల్గొన్నారు.

సహ చట్టం ఏపీ సహాయ అధ్యక్షులుగా రవికుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) సమాచార హక్కు చట్ట న్యాయ పోరాట సమన్వయ కమిటీ, సమాచార హక్కు చట్ట ప్రజా రక్షణ బేరి కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ అధ్యక్షులుగా పొన్న రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మంచి బాధ్యతను అప్పగించిన వ్యవస్థాపక చైర్మన్ కంచర్ల సురేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముస్లిం మైనార్టీలకు ఏ కష్టం వచ్చినా అండ: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముస్లిం మైనార్టీలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా వుంటానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. టిడిపి నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అధిక మెజారిటీతో గెలిచిన సందర్భంగా పుత్తూరు పట్టణంలోని ముస్లిం సోదరులు సోదరీమణులు దాదాపు 50 కుటుంబాలకు చెందిన వారు ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి గజమాలతో సత్కరిం చింది శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్ ముబారక్ తెలిపి బక్రీద్ పండుగకు రావాలని ఆహ్వానించారు. ముస్లిం సోదరులు, మహిళలు వచ్చి సన్మానించడం చాలా సంతోషంగా వుందని భానుప్రకాష్ తెలిపారు. ముస్లిం మైనారిటీలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో , మజీద్ బాషా, మహమ్మద్ గౌస్, జమాల్ అలీ షా, ఎస్ సలీం, ఎస్ కే షబ్బర్, కే సందాని, హమీద్ బాషా, షకీల్, జాఫర్, యూనిస్, మాబాష, నజీర్, స్టూడియో మస్తాన్, జైరహమాన్, మహమ్మద్ రఫీ, ఖాసిం, జలీల్, హమీద్ బాషా, జమీల్, సయ్యద్ ముతల్లి పీర్, సుల్తానా, మహిళలు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- త్వరలో కాల్ సెంటర్ ఏర్పాటు
- గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో త్వరలో క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేసి పట్టణ ప్రజల సమస్యలను కాల్ సెంటర్ ద్వారా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రధానంగా గూడూరు పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా సునీల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎక్కడైనా వీధి దీపాలు వెలగకపోయినా, లేకపోయినా 8790313233 ఫోన్ నెంబర్ ద్వారా సమాచారం అందిస్తే రెండు రోజుల్లో ఆ ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గూడూరు పట్టణానికి తాగునీరు సరఫరా చేస్తున్న వాటర్ వర్క్స్‌ను సందర్శించి అక్కడ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసు కుం టామని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం అయ్యా యని తెలిపారు. రెండో పట్టణ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాల సముదాయంలో తన సొంత నిధులతో బోర్లు వేయించి ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తన నియోజకవర్గంలో రౌడీయిజాన్ని అంతం చేయాలని ఎవరైనా ప్రయత్నిస్తే పోలీస్ శాఖ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని మిట్ట కండ్రిగ గ్రామంలో గ్రామ దేవత అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో టిడిపి విజయం సాధించి, సీఎంగా నారా చంద్రబాబు నాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో గ్రామస్తులు ఆదివారం అంకాలమ్మకు మేళ తాళాలతో, బాణా సంచాల పేలుస్తూ, భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, జనార్ధన్ చౌదరి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, అమరావతిలను అభివృద్ధి చేసేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులు అందించాలని కోరుకున్నా మని తెలిపారు. అనంతరం సామూహిక భోజనాల నిర్వహించి, అందరికీ అన్న ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానికొండ కేశవ నాయుడు, లెక్కల మహేష్ నాయుడు, తులసి బాబు, సురేందర్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, రాజమాణిక్యం నాయుడు, కె నరసింహారెడ్డి, మునిరత్నం నాయుడు, బాల వీరయ్య నాయుడు, మురళీమోహన్, వెంకట ప్రసాద్ చౌదరి, మహిళలు, యువత, పాల్గొన్నారు

విజయోత్సవ సంబరాలు


ఓజిలిలో సంబరాలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 2024 సార్వత్రిక ఎన్నికలలో జనసేన , బిజెపి , టిడిపి కూటమిగా పోటీ చేసి నారా చంద్రబాబునాయుడు , పవన్ కళ్యాణ్, గాలి భాను ప్రకాష్ భారీ మెజారిటీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆ గ్రామస్తులు టిడిపి రూరల్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవత గంగమ్మకు అంబళ్లు పోశారు. నగరి నియోజకవర్గ ప్రజలు, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అన్నదానం నిర్వహించి సంబరాలు నిర్వహించారు.

ఓజిలి: సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యేగా నెలవల విజయశ్రీ భారీ మెజారిటీతో గెలిచిన నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఆదివారం ఓజిలి మండలంలోని గద్దగుంట పంచాయతీలో టిడిపి నాయకులు ఆదివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. వాడవాడలా కేకులు కట్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాకసిరి రమణమ్మ, మండల టిడిపి కన్వీనర్ విజయ్ కుమార్ నాయుడు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ నాయకులు పి. వెంకటసుబ్బయ్య, నాయకులు పాదర్తి ప్రకాష్ నాయుడు కంకణాల వరప్రసాద్ నాయుడు, కలపాటి పుల్లయ్య, బాలకృష్ణ, రాజా,ఎం. చంగయ్య, నాగయ్య, రఫీ, సుబ్రహ్మణ్యం రాజు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాజా ప్రచార కార్యక్రమం 'ఇప్పీ'

టాస్ ప్రారంభం



ప్రజాశక్తి తిరుపతి సిటీ: సన్‌ఫీస్ట్ ఇప్పి ఇన్‌స్టాగ్రామ్‌లో తమ తాజా ప్రచారం ఇప్పి టాస్' గురించి వెల్లడించిన నూతన ప్రచార కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్ స్నాక్స్, నూడుల్స్ అండ్ పాస్తా, ఫుడ్ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కవిత చతుర్వేది మాట్లాడుతూ సన్‌ఫీస్ట్ ఇప్పీ సన్ ఫీస్ట్ నుండి ప్రముఖ ఇన్‌స్టంట్ నూడిల్ అండ్ పాస్తా బ్రాండ్, దేశంలో ఎక్కువ మంది ఇష్టపడే క్రికెటర్లు -రాహుల్ ద్రవిడ్, జస్ప్రీత్ బుమ్రా సూర్య కుమార్ యాదవ్‌ల తో తీర్చిదిద్దిన సరికొత్త ప్రచారంతో ఇది తిరిగి వచ్చిందన్నారు. దీంతో క్రికెట్ ఉత్సాహం తారాస్థాయి చేరుకుందన్నారు. జస్ప్రీత్ బుమ్రా, సూర్య కుమార్ యాదవ్ తమ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్‌లో 'ది టాస్' గురించి పంచుకున్న పోస్ట్‌ల వెనుక రహస్యం తెలుసుకోవాలనే ఆసక్తి తో ఇప్పటి వరకు ఇంటర్నెట్ లో ఆసక్తి నెలకొంది. ఆటగాళ్ల పోస్ట్‌ల వెనుక అర్థం తెలియక సతమతమైన అభిమానుల ఆసక్తిని మరింత పెంచుతూ, ఇతరులు కూడా దీనిపై వైరల్ చేశారన్నారు. ఈ నూతన ప్రచారంలో రాహుల్ ద్రవిడ్ ప్రారంభించారన్నారు. ఐటీసి సన్ ఫీస్ట్ ఇప్పి నూతన టీవీసి అందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు. మా ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రైం న్యూస్

ఐదుగురు విలేకరులపై కేసు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరుకి చెందిన ఐదుగురు విలేకరుల పై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. గూడూరు రూరల్ మండల పరిధిలోని రామలింగపురం కండ్రిగకి చెందిన రైతు సైదాపల్లి కిరణ్ తనకి చెందిన పట్టా భూమి నుండి చెన్నూరు సమీపంలోని ఇంటి స్థలంలో మట్టిని నింపుకునేందుకు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న గూడూరుకి చెందిన విలేకరులు మట్టి తరలిస్తున్న కిరణ్‌ను అడ్డుకుని అనుమతులు లేకుండా మట్టి ఎలా తరలిస్తారు?' అని నిలదీశారు. ' నా పొలం నుండి స్వంత ఇంటికి మట్టిని తోలుకుంటున్నాం..' అని చెప్పినా ' ఏ అధికారి అనుమతి ఇచ్చారు..?' అని ఘర్షణకు దిగారు. 'కొంత నగదు ఇవ్వండి.. లేదంటే వాహనాలను సీజ్ చేస్తాం..'అని బెదిరించారు. ఈ క్రమంలో రూ.25 వేలు డిమాండ్ చేయగా తను అంత ఇచ్చు కొలేనని, ఎనిమిది వేల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం బాధితుడు రూరల్ పోలీసులకు విషయం ఫిర్యాదు చేయడంతో ఈ విషయం డిఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేసి డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులపై కేసు నమోదు చేయాలని ఎస్ఐని ఆదేశించారు. దీంతో ఎస్ఐ విచారణ జరిపి సెక్షన్ 341, 384 ల కింద కేసు నమోదు చేశారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి- వెంకటగిరి రూరల్:

వెంకటగిరి మండలంలోని వల్లివేడు పంచాయతీలోని బస్సపాళెం గ్రామ పరిధిలో పేకాట రాయుళ్లను దాడిచేసి పట్టుకున్నామని వెంకటగిరి ఎస్ఐ జిత్య నాయక్ పేర్కొన్నారు. బస్స పాలెం గ్రామ చివర రైల్వే కట్ట దగ్గర కొంత మంది పేకాట ఆడుతున్నారని సమాచారం అందించడంతో ఎస్ఐ తన సిబ్బందితో ఆ ప్రాంతంలోకి వెళ్లి పేకాట ఆడుతున్న వారిని, నిర్వాహకులను పట్టుకున్నామని తెలిపారు. ఏడు గురు పేకాట రాయుళ్ల నుండి కొంత నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిం చా మన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.


బొజ్జల సుధీర్‌రెడ్డికి ప్రసాదాలు అందిస్తున్న గుడిమల్లం ఆలయ సిబ్బంది

ఎమ్మెల్యేకు గుడిమల్లం ప్రసాదాలు అందజేత

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్:

శ్రీకాళహ స్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డికి గుడిమల్లం శ్రీ పరుశురామేశ్వర స్వామి ఆలయ ప్రసా దాలను వేద పండితులు, అర్చకులు ఆదివారం అందించా రు. గుడిమల్లం ఆలయ ఛైర్మన్ బత్తల గిరినాయుడు, ఆలయ వేద పండితులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసి గుడిమల్లం ఆలయ శేష వస్త్రంతో సత్కరించి, ఆశీర్వచనం, ప్రసాదాలు అందించి అభినందనలు తెలిపారు. బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మను ఆశీర్వదించి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గిరినాయుడు, సురేష్ నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

అల్పాహారం ఏర్పాటు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్:

ఫాదర్స్ డే సందర్భంగా ఏర్పేడు మండలం రాచపాలెంలో స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ నరసింహ చారిటబు ల్ ట్రస్ట్‌లో వృద్ధులకు శాలువతో సన్మానం చేసి అనంతరం ఉదయం టిఫిన్ ఏర్పాటు చేశామని ట్రస్ట్ ఫౌండేషన్ ఫౌండర్ వంశీ తెలిపారు. తాను చేస్తున్న సేవలకు అండగా నిలిచిన యూత్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశీ, చిట్టిబాబు, కళ్యాణ్, సురేష్, బద్రి, దినేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి -రేణిగుంట:

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని రేణిగుంట ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తిలోని ఎమ్మెల్యే నివాసంలో టిడిపి సీనియర్ నాయకులు జీకే మునీర్ ఆధ్వర్యంలో రేణిగుంట ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఆదివారం పూల మాలతో సన్మానించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. బక్రీద్ పర్వదిన సందర్భంగా రేణిగుంటకి రావాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాజీ రహీం, అఫ్రోజ్, నవాబ్, సమి, జిలాని, కరీముల్లా, ఇమ్రోజ్, మహబూబ్ బాషా, సలీం, మహబూబ్ బాషా, నాగేశ్వరరావు, అంబి, గౌతమ్ గిరి, డి పుష్ప నాథం పాల్గొన్నారు.

ముగిసిన ద్రౌపది ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- ఏర్పేడు :

ఏర్పేడు మండలంలోని పాతవీరాపురంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న ద్రౌపది ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆదివారం ఉదయం భీమునితో దుర్యోధనుని వధ ఘట్టం ఆ గ్రామస్తులే భీముడు, దుర్యోధన వేషధారణలతో ఘట్టం ప్రదర్శించారు. సాయంత్రం ద్రౌపది ధర్మరాజుల ఊరేగింపుతో అగ్ని గుండం ప్రవేశం, అగ్నిగుండం మహోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.